సాక్షి
కాకినాడ

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



ఆటహాసంగా..

ఆలిఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ పురుషులు, మహిళల పోటీలు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.


8లో



స్కూల్ బస్సు ఢీకొని బాలుడి మృతి

నిత్యం ప్రయాణిస్తున్న స్కూల్ బస్సే ఆ బాలుడి పాలిటి మృత్యుశకటమైంది. గోకవరం మండలం వెదురుపాకలో స్కూల్ బస్సు కింద పడి ఎల్‌కేజీ విద్యార్థి మృత్యువాత పడ్డాడు.

సాగుకు 8,500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,600, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 4,300 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.50 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

హుండీల ఆదాయం రూ.11,61,650



హుండీల ఆదాయం లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

పిఠాపురం: పాదగయ శ్రీ కుక్కుటేశ్వరస్వామి వారి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.11,61,650 ఆదాయం సమకూరిందని ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు. దేవదాయ, ధర్మదాయ శాఖ తనిఖీదారు వడ్డీ ఫణీంద్ర కుమార్ సమక్షంలో దేవస్థానం సిబ్బంది, సేవా సంఘం భక్తులు, పట్టణ ప్రముఖులు, బ్యాంక్ సిబ్బంది ఆధ్వర్యాన ఆలయంలో శనివారం హుండీల ఆదాయం లెక్కించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నోట్లు రూ.10,42,690, చిల్లర నాణేలు రూ1,18,960 వచ్చాయని తెలిపారు.

61 వేల మంది రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య

పిఠాపురం: జిల్లాలోని 1.34 లక్షల మంది రైతుల్లో 61 వేల మందికి ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేశామని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ కుమార్ తెలిపారు. గొల్లప్రోలు మండలం మల్లవరం రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను సులభంగా పొందడానికి ప్రతి రైతుకూ ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తున్నామన్నారు. రైతులు తమ ఆధార్ నంబర్, ఆధార్ అనుసంధానిత ఫోన్ నంబర్, పట్టాదారు పాస్ పుస్తకంతో గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి, ఈ సంఖ్య పొందవచ్చన్నారు. ఈ నెలాఖరులోగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజయ కుమార్ కోరారు. కార్యక్రమంలో గొల్లప్రోలు మండల వ్యవసాయ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ ఇంటిపై దాడి

సామర్లకోట: స్థానిక 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ఇంటిపై అదే ప్రాంతానికి చెందిన కొంత మంది గురువారం రాత్రి దాడి చేశారు. ఈ మేరకు హరిబాబు గురువారం అర్ధరాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటికి వస్తున్న సమయంలో కొంత మంది తన కారుకు అడ్డంగా వచ్చారని, కారు అద్దాలు పగులగొట్టారని తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే తనపై దౌర్జన్యానికి, తన ఇంటిపై దాడికి దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుల అండతోనే ఈ దాడి జరిగిందని, తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ దాడిపై పూర్తి స్థాయి విచారణ జరిపి, న్యాయం చేయాలని హరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోల్డ్ లోన్ బాధితులకు నెల రోజుల్లో న్యాయం



తాకట్టు పెట్టిన నగల కోసం బ్యాంకుకు చేరుకున్న రుణగ్రస్తులు

తుని రూరల్: తేటగుంట కెనరా బ్యాంకులో గోల్డ్ లోన్ల అవకతవకలు వాస్తవమేనని, బాధితులందరికీ నెల రోజుల్లో న్యాయం చేస్తామని ఇన్‌చార్జి బ్రాంచి మేనేజర్ ఏసుదాసు చెప్పారు. 'కెనరా బ్యాంకులో గోల్డ్ లోన్ల గోల్‌మాల్' శీర్షికన 'సాక్షి' శనివారం వార్త ప్రచురించిన నేపథ్యంలో బంగారం తాకట్టు పెట్టి, రుణాలు పొందిన వారు పెద్ద సంఖ్యలో బ్యాంకుకు చేరుకున్నారు. ఇన్‌చార్జి మేనేజర్‌ను కలసి వారి బంగారం గురించి ఆరా తీశారు. ప్రస్తుతం ఆడిట్ జరుగుతోందని, ఈ ప్రక్రియ నాలుగైదు రోజుల్లో పూర్తవుతుందని వారికి ఏసుదాసు బదులిచ్చారు. ఇప్పటికే మేనేజర్ సహా ముగ్గురిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు జరగకుండా చూస్తామని చెప్పారు. సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు. గోల్డ్ లోన్ల గోల్‌మాల్‌లో అప్రైజర్ ప్రధాన పాత్ర ఉండటంతో తుని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొత్తం 160 ఖాతాల్లో గోల్డ్ లోన్ల అక్రమాలు జరిగినట్టు తెలుస్తోంది. ఎక్కువ మంది రుణం తిరిగి చెల్లించి, బంగారు నగలు తీసుకు వెళుతున్నారు. నగలు తక్కువ ఉన్న బాధితులు ఏయే వస్తువులు గోల్‌మాల్ అయ్యాయో పేర్కొంటూ బ్యాంకుకు ఫిర్యాదులు చేస్తున్నారు.

లెక్క తప్పితే చిక్కులే

- శివరాత్రి ఏర్పాట్లపై పక్కాగా దృష్టి పెట్టాల్సిందే
- పాదగయకు ఏటా 4 లక్షల మంది రాక
- లక్షన్నర మందే వస్తారంటున్న ఆలయ అధికారులు
- లెక్కల్లో పొరబడితే తొక్కిసలాటకు ఆస్కారం
- ముందుచూపుతో ఏర్పాట్లు చేయాలంటున్న భక్తులు
- 18న కలెక్టర్ సమీక్ష



గత ఏడాది మహా శివరాత్రి నాడు లక్షలాదిగా పాదగయకు పోటెత్తిన భక్తులు

పిఠాపురం: దేశంలోని మూడు గయా క్షేత్రాల్లో ఒకటైన పిఠాపురం. ఇది అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన పురుహూతికా అమ్మవారు వెలసిన పుణ్య భూమి. దేశంలోని పంచ మాధవ క్షేత్రాల్లో ఒకటైన కుంతీ మాధవ స్వామి ఆలయం ఇక్కడే కొలువు తీరింది. సాక్షాత్తూ దత్తాత్రేయుని అవతారంగా భావించే శ్రీపాద శ్రీవల్లభ స్వామి జన్మస్థలం కూడా ఇదే. అంతే కాదు.. గయా క్షేత్రం కావడంతో ఇది పితృ కార్యాలకు కూడా ప్రసిద్ధి చెందింది. రాష్ట్రంలోని శైవ క్షేత్రాల్లో ఎంతో ప్రసిద్ధి పొందిన ఇక్కడి పాదగయ ఆలయానికి మహాశివరాత్రి పర్వదిన వేళ లక్షలాదిగా భక్తులు తరలి వస్తూంటారు. మరికొద్ది రోజుల్లో శివరాత్రి పర్వదినం సమీపిస్తున్న వేళ భక్తుల రద్దీకి తగినట్టుగా ఆలయంలో ఏర్పాట్లు చేయాల్సి ఉంది. కానీ, ఇక్కడి అధికార యంత్రాంగం ముందుచూపుతో నిర్ణయాలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ఎందుకంటే..

- పాదగయ శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఓఎస్‌డీ ఇటీవల సమీక్ష నిర్వహించారు. ఆ సందర్భంగా శివరాత్రికి లక్షకు పైగా మాత్రమే భక్తులు వస్తారని ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ చెప్పారు.
- వాస్తవానికి అధికారిక లెక్కల ప్రకారం పాదగయ క్షేత్రాన్ని ఏటా సుమారు 2 కోట్ల మంది భక్తులు దర్శిస్తారు. ఒక్క మహా శివరాత్రి పర్వదినం నాడే సుమారు 4 లక్షల మంది ఇక్కడి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, కుక్కుటేశ్వరస్వామిని, ఇతర దేవతా మూర్తులను దర్శించుకుంటారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించుకుంటారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం శివరాత్రి ఉత్సవాలకు 2.50 లక్షల మందికి పైగా భక్తులు వచ్చారు.
- శివరాత్రి వేళ ఆలయానికి వచ్చిన భక్తుల్లో చాలా మంది పుణ్యస్నానాలు ఆచరించి వెళ్లిపోతూంటారు. వచ్చిన భక్తుల్లో సగం మంది మాత్రమే దర్శనాలకు వస్తూంటారు. ఇలా ఆలయంలోకి వచ్చిన భక్తుల సంఖ్యనే పరిగణనలోకి తీసుకుని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని అంటున్నారు.
- శివరాత్రి రోజు ఉదయం 6 నుంచి 10 గంటల మధ్యలో భక్తుల తాకిడి చాలా ఎక్కువగా ఉంటుంది. గత అనుభవాలను బట్టి ఆ నాలుగు గంటల్లోనే దాదాపు 2 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశాలున్నాయి.
- దర్శనం చేసుకున్నా, చేసుకోకపోయినా భక్తులు ఆలయం పరిసరాల్లోకి వచ్చి తీరుతారు. దీంతో క్యూలైన్లు నిండిపోతాయి. ఒక్కసారిగా వారి తాకిడి పెరుగుతుంది. అటువంటి సందర్భాల్లో వారిని నిలువరించేంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసే అవకాశం ఉండదు. ఎందుకంటే అదే రోజు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో సైతం పోలీసులు శివరాత్రి ఉత్సవాల బందోబస్తు నిర్వహించాల్సి ఉంటుంది.
- మరోవైపు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సైతం శివరాత్రి మర్నాడే జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ఎన్నికల బందోబస్తుకు వెళ్తారు.
- ఇటువంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని తదనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేయాలి. కానీ, లక్షన్నర మందే వస్తారని ఈఓ చెప్పడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా భక్తుల లెక్కల్లో పొరబడితే, ఉత్సవాల ఏర్పాట్లపై కూడా ప్రభావం పడుతుంది. ఒకవేళ అంచనాలకు మించి భక్తులు వస్తే అందుకు తగిన ఏర్పాట్లు లేక అధికార యంత్రాంగం చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడుతుంది.

గత అనుభవాల రీత్యా ఏర్పాట్లు



గత మహా శివరాత్రి ఉత్సవాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది లక్షకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. వీరిలో సుమారు 70 వేల మంది మాత్రమే దర్శనానికి వచ్చే అవకాశం ఉంది. దానికి తగినట్లు పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించి చర్యలు చేపట్టాం. ఈ నెల 18న జిల్లా కలెక్టర్ సమీక్షలో పూర్తి స్థాయిలో నిర్ణయాలు తీసుకుంటాం.

– కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, ఈఓ, పాదగయ క్షేత్రం, పిఠాపురం

అధికారులే బాధ్యత వహించాలి



మహా శివరాత్రి నాడు పాదగయకు మూడు లక్షల మందికి పైగా భక్తులు వస్తూంటారు. ఈ ఏడాది మహా శివరాత్రి బుధవారం మంచి రోజు కావడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. దానికి తగినట్టుగా చర్యలు తీసుకోవాలి. అలా కాకుండా కేవలం లక్షకు పైగా మాత్రమే భక్తులు వస్తారంటూ అధికారులు లెక్కలు వేస్తున్నట్లు తెలుస్తోంది. అలా తక్కువ అంచనాలతో ఏర్పాట్లు చేస్తే పరిస్థితి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంటుంది. జరగరాని సంఘటన జరిగితే అధికారులే బాధ్యత వహించాలి. వీఐపీ దర్శనాలను రద్దు చేసి, సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– వెంకటేశ్వరరావు, విశ్వహిందూ పరిషత్ నాయకుడు, పిఠాపురం

బ్రేక్ దర్శనమంటూ..

మహా శివరాత్రి నాడు వేకువజామున ఒంటి గంట నుంచే భక్తులు పుణ్యస్నానాలు ప్రారంభిస్తారు. మర్నాడు సాయంత్రం వరకూ వారి తాకిడి ఉంటుంది. ఒకేసారి లక్షల మంది వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వారిని గుంపులు గుంపులుగా విడగొట్టి బ్రేక్ ఇచ్చి, స్నానాలకు వదిలేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలా చేస్తే తమ వంతు వచ్చేంత వరకూ ఆగే ఓపిక భక్తులకు ఉండదు. పాదగయ పరిసరాల్లో అంత ఖాళీ ప్రదేశం, పటిష్టమైన బారికేడ్లు ఉండే అవకాశమూ లేదు. అటువంటప్పుడు అధిక సంఖ్యలో భక్తులను ఆపి, వదిలే ఏర్పాట్లు చేస్తే అందరూ ఒక్కసారిగా పరుగు తీసే ఏర్పడుతుంది. అదే కనుక జరిగితే తిరుపతి వైకుంఠ ఏకాదశి టోకెన్ల మంజూరు సందర్భంగా పలువురి ప్రాణాలను బలిగొన్న తొక్కిసలాట వంటి దుర్ఘటనలు జరిగే ప్రమాదం ఉందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. అలా కాకుండా వచ్చిన వారు వచ్చినట్టుగా పుష్కరిణి వద్దకు వెళ్లనిస్తే ఎంత మంది వచ్చినా తొక్కిసలాటకు ఆస్కారం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పాదగయలో గతంలో జరిగిన శివరాత్రి ఉత్సవాలు ఎటువంటి తొక్కిసలాటా లేకుండా సాఫీగా జరిగాయి. ఈ నేపథ్యంలో భక్తులను ఆపాలనే ప్రయత్నంపై అధికారులు పునరాలోచించాలని పలువురు సూచిస్తున్నారు. పాదగయ శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఈ నెల 18న సమీక్ష నిర్వహించనున్నారు. ఆ సందర్భంగా ఈ అంశాలపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ



తిరుచ్చి వాహనంపై సత్యదేవుడు, అమ్మవారి ఊరేగింపు

అన్నవరం: వేలాదిగా వచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం రద్దీగా మారింది. సత్యదేవుని సన్నిధిలోను, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోను శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవ దంపతులు, వారి బంధుమిత్రులతో పాటు ఇతర భక్తులు కూడా తరలి రావడంతో రత్నగిరి కిటకిటలాడింది. స్వామివారి ఆలయం, ఆలయ ప్రాంగణం, విశ్రాంతి మండపాలు, క్యూ లైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. స్వామివారిని సుమారు 30 వేల మంది దర్శించారు. ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. అనంతరం రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, ప్రదక్షిణ చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా ప్రాకార సేవ

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ అమ్మవార్ల ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీదకు వేంచేయించి, ఊరేగింపుగా తూర్పు రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ పండితులు పూజలు చేసిన అనంతరం, దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు కొబ్బరికాయ కొట్టి సేవను ప్రారంభించారు. పండితుల మంత్రోచ్చారణలు, బాజాభజంత్రీల ఘోష నడుమ స్వామి, అమ్మవార్లను ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేయించారు. పునఃపూజల అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రధానాలయానికి చేర్చారు.

నేడు సూర్య నమస్కారాలు

రత్నగిరి కళావేదిక మీద ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సూర్య నమస్కారాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా రుత్విక్కులు సూర్య భగవానుడికి పూజలు చేస్తారు. 11 గంటలకు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారు. అలాగే, ఉదయం పది గంటలకు ఆలయ ప్రాంగణంలో సత్యదేవుడు, అమ్మవారిని టేకు రథంపై ఊరేగిస్తారు.

చికెన్.. రేటు ఢమాల్



- బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్
- ముక్క ముట్టేందుకు భయపడుతున్న జనం
- పడిపోయిన చికెన్, గుడ్డు ధరలు

కాకినాడ సిటీ: బర్డ్‌ఫ్లూ విజృంభించి, లక్షలాదిగా కోళ్లు చనిపోతున్న నేపథ్యంలో జిల్లాలో చికెన్, కోడి గుడ్ల ధరలు గణనీయంగా పడిపోయాయి. బర్డ్‌ఫ్లూ ప్రభావం జిల్లాను తాకనప్పటికీ, ఇతర జిల్లాల్లో ఈ వ్యాధి సోకిందనే వార్తలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. జిల్లాలో ఈ వ్యాధి సోకిందనే పుకార్లు వ్యాపించడం, చికెన్, గుడ్లు తిన రాదని ప్రసార మాధ్యమాల్లో వస్తుండటంతో ముక్క ముట్టేందుకు చికెన్ ప్రియులు జంకుతున్నారు. అయితే, జిల్లాలో ఈ వ్యాధి లేదని, దీనిపై భయపడనక్కరలేదని పశు సంవర్ధక శాఖ అధికారులు అంటున్నారు.

30 వేల మందికి ఉపాధి

జిల్లాలో కోళ్ల పెంపకంపై నేరుగా ఆధారపడి దాదాపు 12 వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. అలాగే దాదాపు 30 వేల కుటుంబాలకు పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. ఫామ్‌లలో ప్రతి నెలా 64 లక్షల నుంచి 90 లక్షల బ్రాయిలర్ కోళ్లు, 30 లక్షల లేయర్ కోళ్లు, లక్షకు పైగా నాటు కోళ్ల పెంపకం జరుగుతోంది. ప్రతి రోజూ దాదాపు 6 లక్షలకు పైగా కోళ్లు జిల్లా నలుమూలలకూ రవాణా అవుతున్నాయి. ఇతర జిల్లాలకు మరో 2 లక్షల కోళ్లు సరఫరా అవుతున్నాయి. వీటిలో సాధారణంగా 3 నుంచి 5 శాతం మరణాలుంటాయని పౌల్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, కొన్ని రోజులకు ముందు కిలో చికెన్ ధర రూ.240 నుంచి రూ.260 వరకూ ఉండేది. బర్డ్‌ఫ్లూ భయంతో అది కాస్తా ప్రస్తుతం రూ.170కి పడిపోయింది. లైవ్ కోడి రూ.85 మాత్రమే పలుకుతోంది. లైవ్ రూ.110కి విక్రయిస్తేనే గిట్టుబాటు అవుతుందని పెంపకందార్లు చెబుతున్నారు.

అధికారులు అప్రమత్తం

బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో జిల్లాలోని కోళ్ల పరిశ్రమదారులను అధికారులు అప్రమత్తం చేశారు. జిల్లాలో కోళ్లకు ఎక్కడా బర్డ్‌ఫ్లూ సోకిన దాఖలాలు లేవని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. కోళ్లు చిన్న జబ్బు పడినట్లు తెలిసినా వెంటనే వైద్యులకు సమాచారం అందించేలా చర్యలు చేపట్టారు. జిల్లాలోని 21 మండలాలకు 42 విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి, కోళ్ల ఫామ్‌లను తనిఖీ చేస్తున్నారు. కోళ్లు చనిపోతే కారణమేమిటో వైద్యులు నిర్ధారించేలా చర్యలు తీసుకున్నారు. ఇతర జిల్లాల నుంచి కోళ్ల రవాణాను నియంత్రించేందుకు ప్రత్యేక టీములను ఏర్పాటు చేశారు.

పక్షుల ద్వారా వ్యాపించే అవకాశం



జిల్లా ఎక్కడా బర్డ్‌ఫ్లూ లక్షణాలు నమోదు కాలేదు. అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలకు ఉపక్రమించాం. పక్షుల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తికి ఆస్కారం అధికంగా ఉంది. అందువలన కోళ్ల ఫామ్‌ల వద్ద పక్షుల సంచారం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించాం. కోడి గుడ్లు, చికెన్ బాగా ఉడికించి తినవచ్చు.

– డాక్టర్ ఎస్.సూర్యప్రకాశరరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, కాకినాడ

తునిలో టీడీపీ అరాచకం

- వైస్ చైర్మన్ పదవి కోసం బరితెగింపు
- రేప్ కేసులు పెడతామంటూ కౌన్సిలర్లకు బెదిరింపులు
- మాజీ మంత్రి దాడిశెట్టి రాజా మండిపాటు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని: మున్సిపల్ ఎన్నికల్లో తుని పట్టణ ప్రజలు టీడీపీకి బుద్ధి చెప్పి, ఒక్క సీటు కూడా ఇవ్వకపోయినా దొడ్డిదారిలో వైస్ చైర్మన్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీ నేతలు అరాచకం సృష్టిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా మండిపడ్డారు. తుని మున్సిపల్ చైర్‌పర్సన్ నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజులుగా తునిలో టీడీపీ నాయకులు, పోలీసులు కలిసి అరాచకం సృష్టిస్తూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను భయాందోళనలకు గురి చేస్తున్నారని అన్నారు. కౌన్సిలర్లకు ఫోన్లు చేసి, రేప్ కేసులు పెడతామని హెచ్చరిస్తూంటే చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు పసుపు చొక్కాలు వేసుకుని వంత పాడుతున్నారని ధ్వజమెత్తారు. గత మున్సిపల్ ఎన్నికల్లో 30కి 30 కౌన్సిలర్ పదవులనూ వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుందని గుర్తు చేశారు. రెండో వైస్ చైర్మన్ ఎన్నిక కోసం ఈ నెల 3, 4 తేదీల్లో కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తే టీడీపీ నాయకులు, గుండాలు, రౌడీషీటర్లు చొచ్చుకుని వచ్చి ఎన్నికను అడ్డుకున్నారని, విధి లేని పరిస్థితుల్లో కౌన్సిలర్లు హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. కౌన్సిలర్ల తరఫు న్యాయవాది సమర్పించిన వీడియోలను పరిశీలించి, ఈ నెల 17న తిరిగి ఎన్నిక నిర్వహించాల్సిందిగా డీజీపీ, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ వీడియో తీయించి, కోర్టుకు సమర్పించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించిందని తెలిపారు.

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇక గలాటా చేసి, వైస్ చైర్మన్ ఎన్నికను అడ్డుకోలేమని తెలుసుకున్న టీడీపీ నాయకులు.. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను బలవంతంగా చేర్చుకోవడానికి బెదిరింపులకు దిగారని రాజా అన్నారు. ఏకంగా మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు జోక్యం చేసుకుని బెదిరింపులకు పాల్పడటం సబబు కాదన్నారు. కౌన్సిలర్ల ఇళ్లకు వెళ్లి, పార్టీ మారకపోతే కేసులు పెడతామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎన్నిక ప్రశాంతంగా జరిపించాలని టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు చిలక పలుకులు పలకడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కోర్టు అక్షింతలు వేయడంతో కళ్లు తెరిచారన్నారు. 30 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఉంటే ఇందులో 10 మందిని బలవంతంగా చేర్చుకున్నంత మాత్రాన వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకోలేరని రాజా స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు టీడీపీ తూట్లు పొడిచినా చివరకు న్యాయమే గెలుస్తుందని స్పష్టం చేశారు.

ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించాలి

- తుని మున్సిపల్ వైస్ చైర్మన్–2 ఎన్నికపై హైకోర్టు ఆదేశం
- అధికార పార్టీ ఆగడాలపై చురక
- అధికారుల బాధ్యతలు గుర్తు చేసిన న్యాయస్థానం
- కౌన్సిలర్ సుమతి రిట్‌పై స్పందించిన కోర్టు

కాకినాడ క్రైం: అధికార పార్టీ ఆగడాలపై హైకోర్టు పరోక్షంగా చురక వేసింది. అధికార మదంతో పేట్రేగిపోతున్న పచ్చ మూకలకు, వారికి వంత పాడుతున్న అధికారులకు తమ విద్యుక్త ధర్మాన్ని గుర్తు చేసింది. తుని మున్సిపల్ వైస్ చైర్మన్–2 ఎన్నికను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. తుని 25వ వార్డు కౌన్సిలర్ కాసే సుమతి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై ఈ మేరకు హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించిన వివరాలివీ.. కౌన్సిల్‌లో ఒక్క సభ్యుడు కూడా లేకపోయినా.. తుని మున్సిపల్ వైస్ చైర్మన్–2 ఎన్నికను టీడీపీ గూండాలు రెండుసార్లు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ మేరకు ఈ నెల 3న ఎన్నిక జరగాల్సి ఉంది. ఆ రోజు వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు వెళ్తున్న చైర్‌పర్సన్‌ను, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో 'పచ్చ' మూకలు బరితెగించాయి. కౌన్సిలర్లు, అధికారులకు మాత్రమే అనుమతి ఉండే కౌన్సిల్ హాలులోకి టీడీపీ నాయకులు, 'పచ్చ' గూండాలు చొరబడి, ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్నారు. దీంతో ఎన్నిక ఈ నెల 4వ తేదీకి వాయిదా పడినా ఆ రోజు కూడా టీడీపీ మూకలు ఎన్నిక జరగనివ్వలేదు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న సర్వశిక్షా అభయాన్ సీఈవో పి.వేణుగోపాలరావు మున్సిపల్ కార్యాలయానికి రాకుండా తహసీల్దార్ కార్యాలయంలోనే ఉండిపోయారు. తద్వారా అధికార టీడీపీకి పరోక్షంగా ప్రయోజనం చేకూర్చే ప్రయత్నం చేశారనే విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాలని మూడోసారి నిర్ణయించారు.

ఈ పరిణామాల నేపథ్యంలో 25వ వార్డు కౌన్సిలర్ కాసే సుమతి హైకోర్టును ఆశ్రయించారు. మూడోసారైనా ఎన్నిక జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు ఉద్యోగ ధర్మాన్ని విస్మరించి, అధికార పార్టీ నేతల కట్టుబానిసల్లా వ్యవహరించడాన్ని, పోలీసులు సహా ఎన్నికల నిర్వహణలో కీలకంగా వ్యవహరించాల్సిన పలు విభాగాల అధికారుల తీరును కోర్టు ముందుంచారు. వారి ఉద్యోగాన్ని వారు సక్రమంగా నిర్వహించేలా ఆదేశించాలని మాండమస్ రిట్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన కోర్టు ప్రతివాదుల వివరణ కోరింది. వారి కౌంటర్‌ను అనుసరించి ఎన్నిక నిర్వహించే కౌన్సిల్ హాలులో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి, పుటేజీని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. మరోసారి ఎన్నిక వాయిదా పడకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసింది. ఎన్నికల్లో ఎక్కడా ఏకపక్ష ధోరణికి తావివ్వొద్దని పేర్కొంది. ఎన్నిక పూర్తి పారదర్శకంగా జరిగి తీరాలని స్పష్టం చేసింది. ఎన్నికను ఇప్పటికే రెండుసార్లు అడ్డుకున్న టీడీపీ నేతల తీరును ప్రజలు ఎండగడుగున్నారు. ఈ నేపథ్యంలో వెలువడిన హైకోర్టు ఆదేశాలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,000
గటగట (వెయ్యి)	16,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 - 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 - 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

పుంగనూరు దూడ జననం



ముంగండలో ఆవుకు జన్మించిన 18 అంగుళాల పుంగనూరు దూడ

పి.గన్నవరం: ముంగండలో శనివారం ఓ ఆవుకు 18 అంగుళాల ఎత్తు ఉన్న పుంగనూరు దూడ జన్మించింది. ఆ గ్రామంలో కాపులపాలేనికి చెందిన పాడి రైతు చేగొండి సత్యనారాయణ ఆవుకు ఈ దూడ పుట్టింది. దీంతో స్థానికులు తరలి వచ్చి ఈ దూడను ఆసక్తిగా తిలకించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



వాకాడ జాన్ బాబు (ఫైల్)

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో హౌరా నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఎక్కుతూ ఓ వ్యక్తి జారిపడి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామానికి చెందిన వాకాడ జాన్‌బాబు (27) నూజివీడు వెళ్లడానికి భార్య, తండ్రితో కలసి సామర్లకోటకు వచ్చాడు. రైలు ఎక్కే సమయంలో ప్రమాదశాత్తూ జారిపడ్డాడు. స్థానికుల సహాయంతో అతని తండ్రి వెంటనే జాన్‌బాబును కాకినాడ ఆస్పత్రికి తరలించే సమయంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు (7) ఉన్నారు. భార్య, తండ్రి ఎదుటే జాన్‌బాబు మృతి చెందడంతో వారిని ఓదార్చడం స్థానికులకు కష్టంగా మారింది. ఈ కేసును రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటహాసంగా..



ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్ తదితరులు

- ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలు ప్రారంభం
- వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారుల రాక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడా స్ఫూర్తితో హాకీ పోటీల్లో ప్రతి ఒక్కరూ రాణించాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి పిలుపునిచ్చారు. శనివారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పురుషులు, మహిళల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు తొలిసారి రాష్ట్రం అతిథ్యం ఇస్తుండడంతో ప్రారంభ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. దీనికి డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్, ఒలింపియన్లు ముకేష్‌కుమార్, మనోహర్ రియాజ్, జేసీ రాహుల్ మీనా, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్, స్పోర్ట్స్ బోర్డు కన్వీనర్ రాజ్‌కుమార్ హాజరయ్యారు. ముందుగా జాతీయ జెండాను జేసీ రాహుల్ మీనా, సివిల్ సర్వీసెస్ జెండాను ఐఏఎస్ భావన, జిల్లా జెండాను డీఆర్‌ఓ వెంకట్రావు ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారుల కవాతును కలెక్టర్ తిలకించి గౌరవ వందనం స్వీకరించారు. పోటీలను కలెక్టర్, ఎస్పీ ప్రారంభించారు. పోటీల ప్రారంభ సూచికంగా బెలూన్లు ఎగుర వేశారు. ఏపీకి చెందిన క్రీడాకారిణి భార్గవి క్రీడా ప్రతిజ్ఞను చేయించారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతి క్రీడాకారుడు ఉత్తమ ప్రతిభ చూపాలన్నారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ముందుగా సివిల్ సర్వీసెస్ బోర్డు టోర్నీని ఏపీకి కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కాకినాడ నగరం చాలా చిన్న నగరమైన సముద్రం, అడవులు, ఆధ్యాత్మిక ప్రదేశాలకు ప్రసిద్ధి అన్నారు. క్రీడాకారులు వాటిని తిలకించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తామని, వాటిని చూసి మంచి జ్ఞాపకాలతో ఈ టోర్నీ నుంచి వెళ్లాలన్నారు. టోర్నీ నిర్వహణకు సహకరించిన అపోలో హాస్పిటల్స్, కాకినాడ సీపోర్ట్సు, జిల్లా రైస్ మిల్లర్స్ సంఘం, వివిధ ఇండస్ట్రీస్ ప్రతినిధులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ట్రిపుల్ ఒలింపియన్లను కలెక్టర్ సత్కరించారు.

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యం

పోటీల ప్రారంభం సందర్భంగా సెట్రాజ్ ఆధ్వర్యంలో చింతూరు గిరిజన సంప్రదాయ కొమ్ము నృత్యం, సిలంబం ఫైన్ ఆర్ట్స్, కళాంజలి ఆర్కెస్ట్రావారి రాక్ బ్యాండ్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్, ఎస్పీలు ఈ నృత్యాలను తిలకించి కళాకారులను అభినందించారు. కార్యక్రమంలో కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు, రాష్ట్ర పీఈటీ సంఘ అధ్యక్షుడు జార్జి, జిల్లా హాకీ సంఘ ప్రతినిధి రవిరాజు, కోకనాడ స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకులు రవిచంద్ర పాల్గొన్నారు.

తొలి రోజు విజేతలు

తొలిరోజు హర్యానా- హిమాచల్ ప్రదేశ్‌కు జరిగిన మ్యాచ్‌లో హర్యానా 14-0 స్కోర్‌తో విజయం సాధించింది. కర్ణాటక-పుదుచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో పుదుచ్చేరి 10-1 స్కోర్‌తో విజయ కేతనం ఎగురవేసింది.



సంప్రదాయ కొమ్ము నృత్యం చేస్తున్న గిరిజనులు



మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్న ఆతిథ్య ఏపీ జట్టు

స్కూల్ బస్సు ఢీకొని బాలుడి మృతి



సంఘటనా స్థలంలో విచారణ చేస్తున్న పోలీసులు

వెదురుపాకలో ఘటన



కుంచే వెంకట జితేంద్ర (ఫైల్)

గోకవరం: నిత్యం ప్రయాణిస్తున్న స్కూల్ బస్సే ఆ బాలుడి పాలిట మృత్యు శకటమైంది. గోకవరం మండలం వెదురుపాక గ్రామంలో స్కూల్ బస్సు కింద పడి ఎల్‌కేజీ విద్యార్థి మృత్యువాత పడ్డాడు. వివరాల ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన కుంచే రాంబాబు, మహేశ్వరి దంపతులకు లేకలేక పుట్టిన కుమారుడు వెంకట జితేంద్ర (5). అతన్ని గతేడాది కోరుకొండలోని ఓ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో చేర్పించారు. స్కూల్ బస్సు రోజూ ఉదయం ఉదయం 8.30 గంటలకు వచ్చి గ్రామంలో విద్యార్థులను ఎక్కించుకుని సాయంత్రం తిరిగి 5 గంటల లోపు తిరిగి తీసుకువస్తుంది. ఈ క్రమంలో శనివారం ఉదయం స్కూల్‌కు వెళ్లిన వెంకట జితేంద్ర సాయంత్రం బస్సు దిగాడు. తరువాత డ్రైవర్ అజాగ్రత్తగా బస్సు నడపడంతో కింద పడిపోయిన జితేంద్ర తలపై నుంచి బస్సు వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని కుటుంబ సభ్యులు తొలుత కోరుకొండకు తరువాత రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గోకవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం అనంతరం డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై ఎస్సై పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పెళ్లయిన ఐదేళ్లకు..

కూలి పనులు చేసుకుని జీవిస్తున్న రాంబాబు, మహేశ్వరి దంపతులకు పెళ్లయిన ఐదేళ్లకు వెంకట జితేంద్ర జన్మించాడు. అతన్ని అల్లారుముద్దుగా పెంచారు. ఎంతో ఉత్సాహంగా స్కూల్‌కు వెళ్లిన కుమారుడు బస్సు చక్రాల కింద పడి మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో స్కూల్ బ్యాగ్, చెప్పులు రక్తంతో తడిచి ముద్దయి ఉండడం కలచివేసింది. వచ్చే నెలలో ఆ బాలుడి పుట్టినరోజు జరపాలని ఆ కుటుంబం ఉండగా ఇలా జరగడం కలచివేసింది.

క్లీనర్ లేకపోవడంతో ఘటన

రోజూ స్కూల్ బస్సు గ్రామంలోని రామాలయం చివరి వీధిలో ఓ కిరాణా షాపు వద్ద బస్సు ఆగుతుంది. ఆ ప్రాంతంలో నలుగురు విద్యార్థులు బస్సు దిగుతుంటారు. నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులో డ్రైవర్‌తో పాటు క్లీనర్ ఉండాలి. పిల్లలు దిగిన తరువాత వారిని సురక్షిత ప్రాంతంలో దించి వెళ్లాల్సి ఉండగా శనివారం స్కూల్ బస్సులో క్లీనర్ లేకపోవడంతో ఈ దుర్ఘటన జరిగింది. విద్యార్థులు స్కూల్ బస్సు దిగిన తరువాత బాలుడు వెంకట జితేంద్ర బస్సు ముందుకు వెళ్లడం, డ్రైవర్ నిర్లక్ష్యంగా ముందుకు నడపడంతో ఈ ఘటన జరిగింది.

ఉద్యోగ భద్రత కల్పించండి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కె.సుమన్, సహాధ్యక్షుడు గంట సంపత్ కుమార్ కోరారు. శనివారం రాజమహేంద్రవరంలో వారు పర్యటించి పలు శాఖల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో మమేకమయ్యారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆదిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమన్, సంపత్‌కుమార్, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెదపాటి గురునాథ్ పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు అయినప్పటికీ రాష్ట్రంలో మెప్మా, సెర్ప్‌లో పనిచేసే ఉద్యోగులకు అప్పటి ప్రభుత్వం హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించిందన్నారు. ప్రస్తుతం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కీలక ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్నారని, వీరికి భద్రత లేని కారణంగా అనేక ఇక్కట్లు పడుతున్నారన్నారు. అందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సుధాకర్, పి.లోవరాజు, ఎడ్ల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో అసోసియేషన్ నాయకులు

దొంగ నోట్ల ముఠా గుట్టురట్టు

- ఐదుగురు నిందితుల అరెస్ట్
- రూ.1.6 కోట్ల నకిలీ నోట్ల స్వాధీనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): దొంగ నోట్ల మారకం ముఠాను తూర్పుగోదావరి జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.1.6 కోట్ల నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఆ వివరాలను రాజమహేంద్రవరం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ నరసింహ కిషోర్ వివరించారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. బిక్కవోలు మండలం అంబడిపేటకు చెందిన వ్యాన్ మెకానిక్ పల్లి రాంబాబును ఈ నెల 1న కోనసీమ జిల్లా బాలాంతరం గ్రామ వాసి చిట్టూరి హరిబాబు కలిశాడు. తన వ్యాన్‌ను రిపేర్ చేయించాలని కోరాడు. దీంతో హరిబాబు తన స్నేహితుడు మెకానిక్ ఆకుల పవన్‌తో కలసి వ్యాన్‌ను గ్యారేజ్‌కు తీసుకువెళ్లారు. వ్యాన్ చెక్ చేసి రూ.పది వేలు ఖర్చు అవుతుందని తెలపడంతో హరిబాబు అందుకు అంగీకరించి అడ్వాన్స్‌గా నాలుగు ఐదు వందల నోట్లు ఇచ్చాడు. హరిబాబు వ్యాన్ స్పేర్ పార్ట్‌లు కొనుగోలు నిమిత్తం దుకాణానికి వెళ్లి ఆ డబ్బులు ఇవ్వగా రూ.500 నోట్లు నకిలీవని తెలియడంతో బిక్కవోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

కేసు నమోదు చేసిన పోలీసులు జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ పర్యవేక్షణలో ఈస్ట్ జోన్ డీఎస్పీ పి.విద్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. ఈనెల 7వ తేదీన దొంగ నోట్లు ఇచ్చిన చిట్టూరి హరిబాబును, అతడి స్నేహితులు కాకినాడ జిల్లా కాజులూరు గ్రామానికి చెందిన శీలం కేదారేశ్వర పరిపూర్ణ శ్రీనివాస్‌ను, దుగ్గుదూరు గ్రామానికి చెందిన చీకట్ల ఏడుకొండలు, పాత గుంటూరుకు చెందిన ధోనేపూడి మధులను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి 756 నకిలీ రూ.500 నోట్లు స్వాధీన చేసుకున్నారు. వారిని న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపించారు. వారిచ్చిన సమాచారం మేరకు ఈ నెల 14న ప్రధాన నిందితుడు పాత గుంటూరు బాలాజీ నగర్‌కు చెందిన కర్రి మణికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నకిలీ నోట్ల ప్రింటింగ్‌కు ఉపయోగిస్తున్న కంప్యూటర్, ప్రింటర్ సామగ్రి, నకిలీ నోట్లు మారకానికి ఉపయోగిస్తున్న కారు, నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఐదుగురు నిందితుల నుంచి మొత్తం రూ.1.6 కోట్ల నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు దొంగ నోట్ల తయారీ మార్గాన్ని ఎంచుకున్నట్లు విచారణలో అంగీకరించారు. ఈ కేసును అన్ని కోణాలలో దర్యాప్తు చేసి, చాకచక్యంగా త్వరితగతిన ఛేదించిన అనపర్తి సీఐ వీఎల్‌వీ కె.సుమంత్, బిక్కవోలు ఎస్సై వి.రవిచంద్రకుమార్, అనపర్తి ఎస్సై వి.శ్రీను, రంగంపేట ఎస్సై టి.కృష్ణసాయి, సిబ్బంది ఏవీ సత్యప్రసాద్, పి.రఘు, కానిస్టేబుళ్లు ఎం.వీరబాబు, కె.తిరుమల యాదవ్, వి.త్రిమూర్తులు, వి.శివ, వి.రవికుమార్, వి.వరప్రసాద్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్

అరవై రోజుల్లో సమస్యల పరిష్కారం

అయినవిల్లి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానానికి వచ్చిన అర్జీలను అరవై రోజుల్లోపు పరిష్కరిస్తామని సీజీఆర్‌ఎఫ్ ఏపీఈపీడీసీఎల్, విశాఖపట్నం చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ అన్నారు. శనివారం అయినవిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వినియోగదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీలో తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార న్యాయస్థానాలు ఉన్నాయన్నారు. ఇందులో విశాఖపట్నం పరిధిలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ 11 జిల్లాలు వస్తాయన్నారు. విశాఖపట్నం పరిధిలో 2004 నుంచి 2025 వరకూ విద్యుత్ వినియోగదారుల నుంచి 8,442 ఫిర్యాదులు రాగా 8,364 సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ఇంకా 78 సమస్యలు మాత్రమే పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 14 నాటికి మొత్తం 112 మంది వినియోగదారులు ఫిర్యాదు చేసుకున్నారన్నారు. ఇప్పటికే 34 సమస్యలను పరిష్కరించామన్నారు. అలాగే ఏపీఈపీడీసీఎల్ నుంచి 107 కేసుల్లో విద్యుత్ వినియోగదారులకు రూ.14,26,650 నష్ట పరిహారం చెల్లించామన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912కు కాల్ చేయవచ్చన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందజేస్తున్నట్లు తెలిపారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న సీజీఆర్‌ఎఫ్, ఏపీ ఈపీడీసీఎల్ విశాఖపట్నం చైర్‌పర్సన్ సత్యనారాయణ

'మాక్సివిజన్' కంటి ఆస్పత్రి ప్రారంభం



రాజమహేంద్రవరంలో మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్

కంబాలచెరువు: స్థానిక దానవాయిపేట చిన్న ఆంజనేయస్వామి గుడి వీధిలో శనివారం మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రిని ఫౌండర్, చీఫ్ మెంటార్ డాక్టర్ కాసు ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాబెటిక్ రెటినోపతి, గ్లాకోమా, చిన్నపిల్లల దృష్టి లోపాల సవరణకు చికిత్సలు, అడ్వాన్స్ లేజర్ విజన్ కరెక్షన్ ఆపరేషన్స్ చేయనున్నట్టు తెలిపారు. తమ హాస్పటల్‌లో 10 వేల చదరపు అడుగులు కలిగిన మాడ్యూలర్ హెపా ఫిల్టర్డ్ ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయన్నారు. పదేళ్ల అనుభవం కలిగిన వైద్య బృందంతో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు.